క్లుప్తంగా

మారేపల్లిలో వేంకటేశ్వర స్వామి మాలధారణ



స్వామివారి మాలధారణలో భక్తులు

దేవరాపల్లి: మారేపల్లి గ్రామం నమో వెంకటేశాయ, నమో శ్రీనివాసాయ, గోవింద నామస్మరణంతో మార్మోగింది. ఇక్కడ సోమవారం పలువురు భక్తులు వేంకటేశ్వర స్వామి మాలాధారణ చేశారు. ఈ నెల 31న గ్రామానికి సమీపంలో శారదానది తీరాన కొండపై వేంచేసియున్న శ్రీదేవి శ్రీభూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయ పునఃప్రతిష్టను పురస్కరించుకుని గ్రామానికి చెందిన 25 మంది భక్తులు స్థానిక రామాలయంలో గ్రామ పురోహితులు జోస్యుల ఫణీంద్ర శర్మ సమక్షంలో మాలధారణ చేశారు. తొమ్మిది రోజులపాటు అత్యంత నియమ నిష్టలతో దీక్ష చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

రహదారి పనుల పరిశీలన



రోడ్డును, స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మహేశ్వరరావు

రావికమతం: కొత్తకోటలో శివాలయం వీధి రహదారికి ప్రత్యామ్నాయంగా వేస్తున్న రోడ్డును తహసీల్దార్ మహేశ్వరరావు సోమవారం పరిశీలించారు. స్థానిక పాత పీహెచ్‌సీ నుంచి ఒకటో వార్డు వరకు ఈ రహదారి నిర్మాణాన్ని రెండు రోజులు క్రితం ప్రారంభించారు. దీనిపై కొంత మంది రైతులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పనులు ఆగాయి. దాంతో తహసీల్దార్ పరిశీలించి సదరు వ్యక్తులు తగిన ఆధార పత్రాలతో కలవాలని సూచించారు.

రెండు పూటలా 'ఉపాధి'తో ఇబ్బందులు



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న దేముడు, తదితరులు

కె.కోటపాడు: వేసవి ఎండలతో రెండు పూటలా ఉపాధి పనుల విధానాన్ని రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి యర్రా దేముడు కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సోమవారం ఉపాధి వేతనదారుల సమస్యలపై కె.కోటపాడులో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ ఏడాదికి 200 రోజుల పని దినాలను కల్పించాలని కోరారు. మిగిలిన వారికి జాబ్‌కార్డులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఉపాధి నిధులను గ్రామాల్లో ప్రభుత్వ భవనాలు, రోడ్లుకు కేటాయించొద్దని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు గాడి ప్రసాద్ పాల్గొన్నారు.

మోదమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న మాలధారణ భక్తులు

రావికమతం: గడబపాలెం మోదమాంబ ఆలయంలో అమ్మవారి మాలధారణ భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. అమ్మవారి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా వంద మందికి పైగా మాలధారణ చేసిన భక్తులు పాల్గొన్నారు. మంగళవారం భారీ ఘటాల ప్రదర్శన, సంబరం నిర్వహించనున్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

కె.కోటపాడు: మండలంలో ఆర్లి, ఆనందపురం గ్రామాల్లో రెండు వలంటీర్ పోస్టులకు ఈ నెల 24వ తేదీలోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కె.శచీదేవి తెలిపారు. ఆనందపురంలో వలంటీర్ పోస్టుకు ఎస్సీ, ఆర్లిలో వలంటీర్ పోస్టుకు బీసీ అభ్యర్థులు అర్హులన్నారు. ఈ నెల 26న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

వేసవి తాటా తీసేద్దాం!

- శరీర చల్లదనానికి తాటి ముంజెలు
- ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన తాటిముంజెలు



తాటిముంజెలు తీస్తున్న గీతకారుడు

చోడవరం రూరల్: వేసవి ఎండలతో మన శరీర ఉష్ణోగ్రతలు తగ్గించుకోవడానికి ఎన్నో రకాల అవస్థలు పడుతుంటాం. చల్లని పానీయాలు, పలు రకాల పండ్లు, పండ్ల రసాలను తీసుకుంటూ శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకుంటాం. ఈ నేపథ్యంలో ప్రకృతి ప్రసాదిత తాటికాయలు దొరికినట్టయితే మహదానందం పడిపోతాం. మనకు కారు చౌకగా, అందుబాటులో దొరికే సహజసిద్ధ జెల్లీ ఫ్రూట్ ఒక్క తాటిముంజె మాత్రమే. పట్టణాల్లో పుట్టి పెరిగినా సరే వీటి రుచి చూడని వారు అరుదు. ఇక పల్లె వాసి తినకుంటే ఆ ఏడాది వేసవి గడవనట్టే ఫీలవుతారనడంలో ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. ఇలా పలువురికి వేసవి దాహార్తిని దూరం చేస్తుంటే, వీటినే నమ్ముకుని అమ్ముకుని కొన్ని కుటుంబాలకు మండు వేసవిలో పండు వెన్నెల కాసేలా చేస్తున్నాయని చెప్పవచ్చు.

తా(డి)టి ముంజెలో పోషకాలెన్నో...

వేసవి తాపాన్ని తగ్గించుకోవడానికి తీసుకునే పండ్లలో పుచ్చకాయ, కర్బూజాలలో నీటిశాతంతో పాటు ప్రొటీన్లు కలిగి ఉంటాయి. వీటికన్నా తాటి ముంజల్లో విటమిన్లు అధికంగా ఉంటాయి. విటమిన్ ఏ అధిక శాతంలో ఉండగా విటమిన్ బి, సిలతోపాటు జింక్, ఐరన్, ఫాస్పరస్, పొటాషియం వంటి విలువైన పోషకాలు ఉంటాయి. వంద గ్రాముల ముంజెల్లో 43 కేలరీలు వరకు ఇవి ఉంటాయి. శరీరంలోని వ్యర్థాలను తాటి ముంజెలు తినడం ద్వారా బయటికి పంపించేయవచ్చు. మలబద్దకాన్ని తొలగించి, జీర్ణశక్తిని మెరుగు పరుస్తాయి. శరీరాన్ని చల్లబరిచే గుణం కలిగి ఉంటాయి. అజీర్తి, ఎసిడిటీ నిర్మూలను ఇవి సహకరిస్తాయి. ముఖంపై మొటిమలకు రాసుకున్నట్టయితే తగ్గిపోతాయి. అధిక బరువును తగ్గించుకోవాలనుకునే వారికి ఇవి మంచి ఫలితాన్నిస్తాయి. ఇక గర్భిణులకైతే మంచి బలాన్నిస్తాయి. మూడు తాటిముంజెలు తింటే ఒక కొబ్బరిబొండాం తాగినంత ఫలితమని శాస్త్రవేత్తల పరిశోధనలో తేలినట్టు చెబుతున్నారు. ముంజెలపై తెల్లటి పొరతోపాటే తింటే మరింత ఫలితమట. అందుకే వేసవిలో మాత్రమే లభించే తాటి ముంజెలను, వీలయితే ఒకసారి రుచి చూసేయండి మరి...

వేసవిలో తాటి ముంజులే ఉపాధి...



మాది విజయనగరం జిల్లా బానాది. మా అత్తగారి ఊరైన గోవాడలో ఉంటూ తాటి ముంజెలను అమ్ముతున్నా. తాటిచెట్టు నుంచి కాయలు దించడం, ముంజెలు తీసి అమ్మడం కొందరి దృష్టిలో ఖర్చులేని పని. కానీ కష్టం మాత్రమే కాదు, వీటిని ఇక్కడికి తరలించడానికి ఆటోకి దూరాన్ని బట్టి రూ.500 నుంచి వెయ్యి రూపాయల వరకు ఇవ్వాల్సి వస్తుంది. ఎండ కాస్తే డజను ముంజెలు రూ.40 నుంచి రూ.50 వరకు అమ్ముడవుతాయి. ఏమాత్రం మబ్బు ఏసినా, వర్షం వచ్చినా కొనే నాథుడే ఉండడు. ఏదో వేన్నీళ్లకు చన్నీళ్లులాగా... ఈటిని అమ్మడం, తినడమే గానీ, తింటే ఇన్ని లాభాలున్నాయని నాకు తెలీదు.

– నెల్లి రాంబాబు,
గీత కార్మికుడు, గోవాడ, చోడవరం మండలం

పిల్లల కోసమని....



నాది అనకాపల్లి. పిల్లలకు తాటి ముంజెలు అంటే ఇష్టం. అందుకే తీసుకుని వెళ్తున్నా. పెద్దలం కూడా తింటాం. ముంజెలు తింటే దాహం తీరుతుంది. కడుపులో చల్లగా ఉంటుంది. ఎంత ఎండలోనైనా ముంజెలు తిన్నాక ప్రయాణం అలసట రానీయదు.. ఏమిటో మరి.

–ఎస్.చిన్నా,
కొనుగోలుదారు,అనకాపల్లి

వలంటీర్ల సేవలతో పేదలకు మేలు

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



అవార్డు గ్రహీతలైన వలంటీర్లను సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, కోలా గురువులు

రోలుగుంట: ఎంపీడీవో కె.ప్రభాకరరావు అధ్యక్షతన స్థానిక స్త్రీశక్తి భవన్‌లో సోమవారం మధ్యాహ్నం వలంటీర్లకు వందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదోళ్లకు పారదర్శకంగా సేవలందించాలనే సత్సంకల్పంతో ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థతో ఊహకు మించిన సేవలందించడంతో ప్రపంచంలోనే ఆదర్శంగా గుర్తింపు వచ్చిందన్నారు. ఈ వ్యవస్థ ద్వారా అవినీతికి తావు లేకుండా అన్ని వర్గాల నుంచి లబ్ధిదారుల ఎంపిక, సంక్షేమ పథకాల మంజూరై నేరుగా అందుతున్నాయన్నారు. వారి సేవలను గుర్తించిన ప్రభుత్వం సేవా వజ్ర, సేవా మిత్ర తదితర పురస్కారాలు అందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవార్డులు పొందేందుకు తమ సేవల ద్వారా పోటీపడి వ్యవస్థకు, ముఖ్యమంత్రికి మంచిపేరు తేవాలన్నారు. అనంతరం చోడవరం నియోజక వర్గం వైఎస్సార్‌సీపీ పరిశీలకులు కొలా గురువులుతో కలిసి అవార్డు గ్రహీతలను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసరావు, పార్టీ నాయకులు గొర్లె చెల్లంనాయుడు, రాజశేఖర్, పోతల లక్ష్మీశ్రీనివాస్ పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పి.వి. రత్నం



బుచ్చెయ్యపేట: మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పి.వి. రత్నం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న అంబేద్కర్ సెలవుపై వెళ్లిపోవడంతో ఆయన స్థానంలో మాడుగుల తహసీల్దార్ పి.వి. రత్నంను ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు. ఈ సందర్భంగా వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందితో సమావేశమై ప్రజలకు అందుబాటులో ఉండి సచివాలయాల ద్వారా సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. జగనన్న శాశ్వత భూ సర్వే పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.

ఇంటి పన్ను హక్కుపై ఆనందం

చోడవరం: పట్టణంలో ఎడ్లవీధి ఎర్రచెరువు గట్టు ప్రాంతంలో నివాసితులకు ఇంటి పన్ను రసీదులు పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నారాయణరావు సోమవారం పంపిణీ చేశారు. కొన్ని దశాబ్దాలుగా ఇక్కడ పంచాయతీ స్థలంలో ఇళ్లు నిర్మించుకుని ఉంటున్న వీరికి ఇంటి పన్నులు వేయక కనీస యాజమాన్య హక్కు లేక వీరంతా చాలా ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితుల్లో ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీకి తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీంతో ఆయన పంచాయతీ అధికారులతో మాట్లాడి 68 ఇళ్లకు ఇంటి పన్నులు వేయించారు. వీరికి ఇంటి పన్ను రసీదులను సర్పంచ్ బండి నూకాలమ్మశ్రీను, వార్డు మెంబరు ఒరుగంటి నాగమణినెహ్రూ అందజేశారు. తమ చిరకాల సమస్య పరిష్కారం కావడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

మాజీ సర్పంచ్ వెంకటరమణ సేవలు చిరస్మరణీయం

సంతాప సభలో డిప్యూటీ సీఎం బూడి



మాజీ సర్పంచ్ వెంకటరమణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

మాడుగుల: ఎంపీపీ వేమవరపు రామధర్మజ తండ్రి, మాజీ సర్పంచ్ వెంకటరమణ (ఎస్‌పీఎల్) మాడుగుల పట్టణాభివృద్ధితోపాటు పార్టీలకతీతంగా నిరుపేదలకు అందించిన సేవలు మరువలేమని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. సోమవారం మాడుగులలో వెంకటరమణ సంతాప సభలో ఆయన మాట్లాడారు. అనంతరం చిత్రపటం వద్ద పూలమాలతో నివాళులర్పించారు. ఇంటి పేరు వేమవరపు అయినా సరే ఎస్‌పీఎల్ రమణగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఎంపీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ దొండా రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, డైయిరీ డైరెక్టర్ శీరం రెడ్డి సూర్యనారాయణ, చీడికాడ జెడ్పీటీసీ లాలం శారదా జానకీరామ్, దేవరాపల్లి మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, కురుసా నరసింహనాయుడు (కవి) పాల్గొన్నారు.

సీఎం ఆశయాలతో వలంటీర్ల వ్యవస్థ

- వలంటీర్ల సత్కార సభలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నాతవరం: వలంటీర్లు అంకిత భావంతో పని చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం నెరవేర్చాలని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ తెలిపారు. ఎం.బెన్నవరం గ్రామ సచివాలయంలో సోమవారం ఉత్తమ వలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులకు అందించడమే ధ్యేయంగా వలంటీర్లు పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. ఎంపీడీవో యాదగిరీశ్వరరావు మాట్లాడుతూ మండలంలో 269 మంది వలంటీర్లకు సేవా మిత్ర అవార్డులు వచ్చాయన్నారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు, సర్పంచ్ మార్తి నాగమణి, ఎంపీటీసీ తమరాన లోవకృష్ణ పాల్గొన్నారు.

ఎ. కొత్తపల్లిలో..

దేవరాపల్లి: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సేవా భావంతో గ్రామ వలంటీర్లు అత్యంత పారదర్శకంగా సేవలందిస్తున్నారని వైస్ ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మీ, సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ అన్నారు. ఎ. కొత్తపల్లిలో గ్రామ వలంటీర్లను శాలువాతో సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఉప సర్పంచ్ సరువునాయుడు పాల్గొన్నారు.

పశు పోషణ, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ



గొర్రెలకు పీపీఆర్ టీకా వేస్తున్న పశువైద్యాధికారి

దేవరాపల్లి: వేసవి ఎండ తీవ్రత నేపథ్యంలో పశు పోషణ, ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి కె.మంజుషారాణి సూచించారు. చింతలపూడి పంచాయతీ శివారు సమ్మెదలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 400 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాగించారు. 350 గొర్రెలకు పారుడు వ్యాధి నివారణ టీకాలను వేశారు. 23 పశువులకు వైద్య పరీక్షలు చేసి పాడిరైతులకు ఉచితంగా మందులు అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



శిశువును అక్కున చేర్చుకున్న డిప్యూటీ సీఎం బూడి

చీడికాడ: గ్రామంలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. సోమవారం జి.కొత్తపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రూ.79.30 కోట్లతో నిర్మించిన నూతన గ్రామ సచివాలయ సముదాయం భవనాలను ప్రారంభించారు. రామాలయం నిర్మాణానికి రూ.5 లక్షల కేటాయింపు, సొంతంగా రూ.లక్ష ఇస్తున్నట్లు ప్రకటించారు. యూపీ స్కూల్‌లో రూ.30.30 లక్షలతో నిర్మించిన తరగతి గదులను ప్రారంభించారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా రూ.16 లక్షలతో కొనుగోలు చేసిన ఆరు పవర్‌టిల్లర్లను రైతులకు పంపిణీ చేశారు. అడిగర్ల, కొల్లి, పిట్టా, వంటాకు వారి కల్లాలకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. అనారోగ్యంతో తల్లులు మృతి చెంది అభాగ్యులుగా మిగిలిన ఇద్దరు శిశువులకు ఆర్థిక సాయమందించారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు యర్రా అప్పారావు, సర్పంచ్ కొల్లి సూరినాయుడు, ఎంపీటీసీ కొల్లి నాగమణి, ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరం రెడ్డి సూర్యనారాయణ, మండల సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య, కో–ఆప్షన్ సభ్యుడు షేకు సూర్యనారాయణ, చీడికాడ, దండిసురవరం పీఏసీఎస్ అధ్యక్షులు మోసూరి సన్నిబాబు, నందారపు రమణబాబు, జి.కొత్తపల్లి సీనియర్ నేతలు కొల్లి శ్రీను, పుట్టా రాంకుమార్, సబ్బవరపు ముత్యాలనాయుడు, కొల్లి వెంకటరావు, కొల్లి రామునాయుడు, నారాయణమూర్తి పాల్గొన్నారు.

నేడు దిబ్బపాలెంలో 'గడపగడపకు'

దిబ్బపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మంగళవారం నిర్వహించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ముగ్గురికి రూ.10.30 లక్షల మంజూరు



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల: ఎంతోమంది అభాగ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆపన్నహస్తం అందిస్తోంది. ఇందులో భాగంగా ముగ్గురి వైద్య ఖర్చుల కింద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రూ.10.30 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు మాడుగులకు చెందిన బాధితులు ద్రాక్షారపు సన్యాసిరావుకు రూ.5 లక్షలు, బాదం కుమార్‌కు రూ.4 లక్షలు, జాజుల జగ్గమ్మకు రూ.1.30 లక్షల చొప్పున వారి ఇళ్ల వద్దకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సోమవారం వెళ్లి చెక్కులు అందజేశారు. మాడుగుల మోదమాంబ కాలనీలో విద్యుత్ షాక్‌తో చేతులు తెగిపడిన సన్యాసిరావు(సన్ని), ఆరో తరగతి విద్యార్థి కుమార్‌లతో పాటు సత్యవరం గ్రామానికి చెందిన జాజుల జగ్గమ్మ పక్షవాతంతో ఆపరేషన్లు చేయించుకున్నారు. వీరంతా ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకొచ్చి సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తులు చేసుకున్నారు. కె. కోటపాడు జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, మాడుగుల జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, ఎంపీటీసీలు పాలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, వార్డు మెంబర్లు శీలామంతుల జ్యోతి, వేమణ గణేష్, నాయకులు ఇందుకూరి నాగరాజు, కోరుకొండ చెల్లంనాయుడు పాల్గొన్నారు.

పీఆర్ అతిథి గృహం పనుల పరిశీలన

మాడుగుల ఆర్అండ్‌బీ అతిథి గృహ ఆవరణలో రూ.1.10 కోట్లతో నిర్మిస్తున్న పీఆర్ అతిథి గృహ పనులు డిప్యూటీ సీఎం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని డీఈ రమణను ఆదేశించారు.

మీ సమస్యల పరిష్కారానికే వస్తున్నాం..

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రోలుగుంట: ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించడంతోపాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడానికి ఇంటింటికీ తిరుగుతున్నామని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం కొండపాలెంలో చోడవరం నియోజకవర్గ పరిశీలకుడు కోలా గురువులుతో కలిసి ఆయన ఇంటింటా తిరిగారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు లేని వారివి, స్థలం లేని నిరుపేదల పేర్లు నమోదు చేసుకున్నారు. వారి అర్హతలు పరిశీలించి పరిష్కరించాలని ఇన్‌చార్జి ఎమ్మార్వో త్రివేణ, హౌసింగ్ ఏఈ ప్రేమానందంను ఆదేశించారు. ఎస్సీ కాలనీ వాసుల సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. కొంత మంది నిరుద్యోగుల ఉపాధి అవకాశాల గురించి చర్చించారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి మాజీ సర్పంచ్‌లు సూర్య సన్యాసిదేముళ్లు, పిల్లా లక్ష్మి, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు పూలమాలలు వేశారు. వైస్ ఎంపీపీ కొల్లు సన్యాసినాయుడు, పార్టీ అధ్యక్షుడు మద్దు అప్పలనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యుడు పోతల లక్ష్మీశ్రీనివాస్, పిల్లా నూకరాజు, స్థానిక ఎంపీపీ పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ బంటు పరిదేశి, ఎంపీటీసీ సభ్యుడు గొర్లె రామన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వలంటీర్ల మాదిరిగా గుర్తింపు పొందాలి..

కొండపాలెంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ నూతన భవనాన్ని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రారంభించారు. ప్రత్యేక శ్రద్ధతో భవన నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేసినందుకుగాను మాజీ సర్పంచ్ బంటు సూర్య సన్యాసిదేముళ్లను అభినందించారు. సచివాలయంలో ప్రజల వినతులను సత్వరమే పరిష్కరించి వలంటీర్ల మాదిరిగా మంచి గుర్తింపు తెచ్చుకోవాలని సిబ్బందిని ప్రభుత్వ విప్ ఆదేశించారు. సిబ్బంది విధులను ఎప్పటికప్పుడు తెలుసుకుని పలు సూచనలు ఇవ్వాలని ఎంపీడీవో ప్రభాకర్రావుకు సూచించారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



ఎం.బి.పట్నంలో సంక్షేమ పథకాలపై వివరిస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్

నాతవరం: రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా గెలిపించేందుకు ప్రజలంతా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన ఎం.బి.పట్నంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరుపై ఆరా తీశారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు, ఇల్లు మంజూరు, సాగు భూమికి పట్టాలు, పింఛన్లు కావాలని పలువురు విన్నవించారు. వీటితోపాటు గ్రామంలో పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా అర్హులకు సంక్షేమ పథకాలు రాకపోతే దరఖాస్తు చేసుకుంటే వెంటనే మంజూరు చేస్తామన్నారు. గడప గడపకు కార్యక్రమం పూర్తి చేసిన పంచాయతీకి మంజూరైన రూ.20 లక్షలతో గ్రామంలో ప్రధాన సమస్యలు పరిష్కరించటంతోపాటు పలు అభివృద్ధి పనులు చేసుకోవచ్చన్నారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తహసీల్దార్ పి.కనకారావు, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి సర్పంచ్ కాళ్ళ ఝాన్సీరాణి, ఎంపీటీసీ పల్లి భవాని, ఏఎంసీ డైరెక్టరు అడిగర్ల నాయుడు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఉలబాల శ్రీను, సబ్బవరపు వెంకునాయుడు, ముత్తా శివాజీ, కరక అప్పలరాజు, ఐసీడీఎస్ సీడీపీవో శ్రీగౌరీ, ఏపీవో చిన్నారావు, ఏపీఎం మర్రి లక్ష్మి, పి.కె.గూడెం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి అచ్చెర్ల వరహాలబాబు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

నేడు ఎ.శరభవరంలో గడప గపడకు...

ఎ.శరభవరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ మంగళవారం నిర్వహించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు తెలిపారు. పార్టీ శ్రేణులంతా విధిగా హాజరు హావాలని కోరారు.

తక్షణ సాయం అందజేత



చెక్కు అందజేస్తున్న వైస్ ఎంపీపీ రాజారామ్

మాడుగుల: గాదిరాయిలో ఇటీవల గేదెల రామునాయుడు మృతి చెందాడు. అతడి కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద సోమవారం రూ.10 వేలు వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అందజేశారు. మిగిలిన రూ.90 వేలు నామినీ బ్యాంకు ఖాతాకు జమవుతాయన్నారు. వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు పర్రే రామునాయుడు, నాయకులు పర్రే రమణ, మల్లునాయుడు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర స్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

రావికమతం: స్థానిక హైస్కూల్ గ్రౌండ్‌లో ఉత్తరాంధ్ర స్థాయి మెగా వేసవి క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్ రాజు సోమవారం ప్రారంభించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.15 వేల చొప్పున ఇవ్వనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఇప్పటికే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి జిల్లాల నుంచి 60 జట్లు వచ్చాయని, లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహిస్తున్నామని రావికమతం యూత్ తెలిపారు.

గిరిజనుల నిరసన

రావికమతం: కల్యాణపులోవ రిజర్వాయర్ పరీవాహక ప్రాంతంలో మైనింగ్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వవద్దని చీమలపాడు పంచాయతీ శివారు గిరిజనులు కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. రిజర్వాయర్ ఉనికికి ప్రమాదం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.